www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 28 సెప్టెంబర్ 2025
5
వైఎస్ఆర్

డిగ్రీ రెండో దశ అడ్మిషన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - కడప : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఖరారు చేసిన షెడ్యూల్ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల ప్రవేశాల కోసం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) (ఆర్ట్స్ కళాశాల)లో ఈనెల 26 నుంచి రెండవ విడత అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కడప ఆర్ట్స్ కళాశాలలో స్పెషల్ తెలుగు, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ ఉర్దూతో బి.కాం., జనరల్, బి.కాం., కంప్యూటర్ అప్లికేషన్స్, బి.కాం, బిఎస్‌ఎస్‌బి, బిఎస్‌సి లో - గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, జియాలజీ, కంప్యూటర్ సైన్సు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, స్టాటిస్టిక్స్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంటర్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన కోరారు. కళాశాలల ఎంపికకు రెండవ విడత వెబ్ ఆప్షన్ల నమోదు ఈనెల 29న మొదలవుతుందని తెలిపారు.

ప్రజల సేవ, రక్షణ కోసమే ఖాకీ

- ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వేధింపులు, ఇతర సమస్యలతో ఉన్న వారికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ మహిళలకు భరోసా ఇచ్చారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) సభ్యులకు 'మహిళా భద్రత-డ్రగ్స్ నిర్మూలన' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాకీ యూనిఫామ్ ప్రజల సేవ, రక్షణ కోసమే నని, పోలీస్ శాఖ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రత- డ్రగ్స్ నిర్మూలనపై సిఎం చంద్రబాబు ప్రతి వారం సమీక్షిస్తున్నారని, పోలీస్ శాఖ కూడా సీరియస్‌గా దృష్టి పెట్టిందని చెప్పారు. పోలీస్ అధికారులందరూ తక్షణం స్పందిస్తున్నారని చెప్పారు. మహిళలకు వేధింపులు, ఇతరత్రా సమస్యలు ఉంటే వెంటనే పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కౌన్సెలింగ్ ద్వారా సమస్యను వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తాను ఎల్లప్పుడు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, ఫిర్యాదులతో కలవవచ్చని, పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. సమాజ అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. **డ్రగ్స్, గంజాయి పై ఉక్కుపాదం**... కడప నగరంలో, జిల్లాలో డ్రగ్స్, గంజాయిపై గట్టి చర్యలు చేపట్టామని తెలిపారు. పోలీస్ శాఖ చేపట్టిన కఠిన చర్యల వల్ల గంజాయి, డ్రగ్స్ పూర్తిగా అదుపులో ఉన్నాయన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలు ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే వెంటనే పోలీస్ శాఖ 1972 టోల్ ఫ్రీ నంబర్ కు, వాట్సాప్ నంబర్ 8977781972 లకు తెలియచేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అత్యవసర సాయం కోసం డయల్ 112, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నంబర్ 1098, గృహ హింస 181, మహిళల వేధింపులు 1091 , సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్ 1930 లకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. తక్షణమే పోలీస్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. కమిషనర్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత - డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మరింత సమర్థవంతంగా, వేగవంతంగా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిఎస్‌టి సవరణల వల్ల వినియోగదారులకు ఎంతో మేలు చేకూరిందని, 99 శాతం వస్తువులు, సేవలు పన్నురహితంగా మారాయన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలు చుట్టుప్రక్కల నివసించే వారందరికీ తెలియచేసి చైతన్యం తీసుకురావాలని సూచించారు. మెప్మా పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నిరక్షరాస్యత, పేదరికం వల్ల నేరాలు జరిగే అవకాశం ఉంటుందని, మెప్మా ద్వారా పేదరిక నిర్మూలనకు చేస్తున్న కృషి ని వివరించారు. జిల్లాలో 8 మున్సిపల్ పట్టణాలలో 14,556 స్వయం సహాయక బృందాలు ఉన్నాయని, ఒక్కో గ్రూప్ లో 10 మంది సభ్యులుగా ఉంటారని వివరించారు. నేరాల కట్టడిలో పోలీస్ శాఖ కు మెప్మా తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం 'ఈగల్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను ఎస్‌పి, అదనపు ఎస్‌పి (పరిపాలన), కమిషనర్, మెప్మా పిడిఐఎ డీఓలు ఎలైట్ యాంటి నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఆధ్వర్యంలో రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను ఆవిష్కరించారు. టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు సూచించారు.

7న ధర్నాను విజయవంతం చేయండి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు మల్లు రఘునాథ రెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం కడప జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎస్‌ఎండి ఇలియాస్ బాష అధ్యక్షతన వివిఆర్ ఎన్‌జిఓ భవన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్‌సి మధ్యంతర భృతి మంజూరు, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి కానీ, చర్చించిన పరిస్థితి కానీ లేదన్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగుల సంబంధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచిపోయిందని వాపోయారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇంతవరకు చర్చించిన పరిస్థితి లేదన్నారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు సంబంధించిన దస్త్రం ఆర్థిక శాఖలో నాలుగు సంవత్సరాలుగా మూలుగుతుందన్నారు. విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, అంత్యక్రియల ఖర్చులు తదితర పెన్షన్ సౌలభ్యాలను కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ప్రతి సంవత్సరము రూ. 180 కోట్ల వ్యాల్ కార్డుల అమలు కోసం చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డుపై వైద్యానికి ఏ హాస్పిటల్లో

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

అంగీకరించడం లేదన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. వెంటనే ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యం, అర్బన్ ఎంఇఒ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. గురుకుల, ఆదర్శ,1998, 2008 డిఎస్‌సి, ఎంటిఎస్ టీచర్ల విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కెజిబివి ఉపాధ్యాయులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతన స్కేల్ కూడా అమలు చేయడం లేదన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలలో జాప్యం వలన మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ క్యాటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జేఎల్ పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచకపోవడంతో మూడు దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా, కార్యవర్గ సభ్యులు పి.మహేష్ బాబు, కె.బాలగంగి రెడ్డి, నరసింహులు, షేక్. సాజిత్, బి.శివ శంకర్ రెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్, జి.రామ మోహన్, ఎల్.గంగిరెడ్డి, సురేంద్ర నాయక్ పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే మోడీ ప్రభుత్వం

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు

సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - బద్వేలు

భారతదేశంలో హిందుత్వం పేరుతో మతోన్మాదాన్ని, కార్పొరేట్ శక్తులను బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి పెంచి పోషిస్తుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు అన్నారు. బద్వేల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య వైశమ్యాలను పెంచి పోషిస్తుందని, మతాల మధ్య అగ్గి రాజేస్తూ వాటి మధ్యలో కూర్చొని చలికాచుకుంటుందని వారు విమర్శించారు. దేశంలో లౌకికవాదాన్ని మంట కలుపుతూ మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను దారిమళ్లిస్తూ నియంతలాగా దేశాన్ని మోడీ పరిపాలిస్తున్నారని వాపోయారు. దీనికి రాష్ట్రంలోని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తోడు కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ఆదాని అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ భారతదేశ సంస్థలన్నింటినీ వారికి తాకట్టు పెడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుందని విమర్శిం చారు. పెద్ద నోట్ల రద్దు పేరుతో వందల మంది ప్రాణాలను బలికొన్న చరిత్ర ఎన్‌డిఎ కూటమిదని, జిఎస్‌టి పేరుతో సంవత్సరాల పాటు ప్రజలను దోచుకున్నారని చెప్పారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో కొంతమేర జిఎస్‌టిని తగ్గిస్తూ దేశ ప్రజల కోసం పనిచేస్తున్నట్లు ఫోజులు కొట్టడం మోడీ ప్రభుత్వానికి మాత్రమే చెల్లిందన్నారు. కార్పొరేటు వ్యక్తులకు సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ దేశ ప్రజల మీదమోయలేని భారాలు మోపి ందన్నారు. అమెరికా అధ్యక్షులు మన దేశ అంతర్గత విషయాల్లో పెత్తనం చేస్తూ ఉంటే నోరు ఎత్తడం చేతకాని ప్రభుత్వమని చెప్పారు. మోడీ ఓ పక్క మతో న్మాదాన్ని మరోపక్క కార్పొరేట్ వ్యక్తులను అడ్డుపెట్టుకొని దేశంలో పరిపాలన సాగిస్తున్నారని, ప్రజల చైతన్యం ముందు ఇవి ఎప్పుడైనా బద్దలు కాక తప్పదని వారు తెలిపారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు, చిన్ని, శివ, నాగేంద్ర బాబు, సుబ్బారాయుడు, మురప్రసాద్, పోరుమామిళ్ళ, బద్వేలు రూరల్, అట్లూరు, గోపవరం, మండల కార్యదర్శులు భైరవ ప్రసాద్, డి.వెంకటేష్, రమణయ్య, నరసింహ, నాయకులు లావణ్య, జయరాజ్, సరోజమ్మ, యానాదయ్య, దుర్గమ్మ, స్వప్న, చంద్ర, సరస్వతి పాల్గొన్నారు.

కడప శిల్పారామంలో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

కడప శిల్పా రామంలో దసరా ఉత్సవాలు ఈనెల 28 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తామని శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం కడప స్టేట్ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సాంప్రదాయాలతో, బుల్లి తెర డాన్స్, పల్లె జానపదాలు, మాస్ నృత్యాలతో వైభవంగా దసరా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. చేతి వృత్తి ప్రదర్శనలు, లండన్ బస్సు, ట్రాక్టర్ ట్రైను, కొలంబస్, డాష్ కార్లు ఉంటాయని పేర్కొన్నారు. గుర్రపు స్వారీ త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. పచ్చికబైళ్లల్లో ఫొటో షూటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. పడవ విహారం, పాతబడిన తుక్కుబడిన విగ్రహాలు ఉన్నాయని పేర్కొన్నారు. విలేజ్ మ్యూజియం ఉంటుందని, అందులో మంగలి, వడ్రంగి, చెప్పులు కుట్టే వాళ్ళు ప్రతిమలు ఉంటాయని తెలిపారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి పాటలు, కూచపూడి, భరతనాట్యం నిర్వహించి ప్రశంసా పత్రాలు అందిస్తామన్నారు. కొండపల్లి బొమ్మలు, శారీలు, చెక్కభజనలు ఏర్పాటు చేస్తామని కూడా చెప్పారు. పిపిసి పద్ధతిలో శిల్పారామాన్ని అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సాయంత్రం 6:30 నుంచి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఏఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తోట సుధాకర్ ప్రసాద్‌కు నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తోటా సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతిని పురస్కరించుకుని కడప ఎపిఎన్‌జిఒ హోంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్య ఆధ్వర్యంలో సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. పోరాటం మధ్యలోనే ప్రమాదంలో అశువులుబాసిన తోట సుధాకర్ ప్రసాద్ అకాల మరణం చాలా బాధాక రమన్నారు. వారి ఆశయాలను ఎపి ఎన్‌జిజిఒ అసోసియేషన్, ఎపి జెఎసి ఎప్పుడు ముందుకు తీసుకు వెళ్తూ వారి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టి శ్రీనివాసులు, సిద్దయ్య, రాజశేఖర్, పద్మనాబారావు, హీరోమియా, సీటీ అధ్యక్షులు చిన్నయ్య, నాయకులు నాగార్జున, కృష్ణకుమారి, లక్ష్మి, బాదుల్లా, ఉద్యోగులు, నాలుగో తరగతి జిల్లా నాయకులు కాటమయ్య, జానకి పాల్గొన్నారు.

తోట సుధాకర్ ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

మహిళల ఆరోగ్యమే లక్ష్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - గోపవరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి సశక్తి పరివార అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు సందర్శించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లాలో మెగా వైద్య శిబిరంలో ఏర్పాటు చేసి ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం అంతా కూడా ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. ప్రధానంగా గర్భాశయ, రొమ్ము కేన్సర్లకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి నివారణకు తోడ్పడుతారని చెప్పారు. రక్తపోటు, షుగర్, గుండె జబ్బులకు సంబంధించిన నిపుణులైన డాక్టర్‌తో స్క్రీనింగ్ చేస్తారన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ వి. మల్లేష్, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ మురళీకృష్ణ, నిపుణులైన డాక్టర్లు వెంకట సుమన్, డాక్టర్ శివలత, దంత వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ ఆయుష్ సిబ్బంది, అంగన్వాడీ సూపర్వైజర్స్, అంగన్వాడి కార్యకర్తలు, బద్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గౌస్ బాషా, పబ్లిక్ హెల్త్ నర్స్, విలేజి హెల్త్ క్లినిక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 3 నుంచి టైలరింగ్‌లో 31 రోజుల పాటు మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం. ఆరిఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని 18 నుండి 45 సంవత్సరాల లోపు వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మన కడప - ఘనగడప వీడియో ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉమ్మడి కడప జిల్లా కళలకు కాణాచి అని, సంస్కృతి సాంప్రదాయాలకు, ఆత్మీయతకు పెట్టింది పేరని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ అభిప్రాయపడ్డారు. కడపజిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సభాభవనంలో శనివారం రచయిత, ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వర రెడ్డి రచించిన మన కడప-ఘన గడప పాట వీడియో ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై వీడియోను ఆవిష్కరించి ప్రసంగించారు. ఉమ్మడి కడప జిల్లాలోని ఆధ్యాత్మిక స్థలాలు, దర్శనీయప్రాంతాలు, నదులు, ఖనిజ సంపద, కవులు, అవధానులు, కళాకారులు, ఆటలు మొదలగు సమస్త అంశాలను కూర్చి అద్భుతమైన పాటను రచించి, గానం చేసి, వీడియోగా చిత్రీకరించి అందించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, ఎ.ఎం.ఒ వీరేంద్ర, ఉపాధ్యాయ సంఘాల నాయకులు లెక్కల జమాల్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, బాలగంగి రెడ్డి, ఇలియాస్ బాష, రామాంజనేయులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వల్లూరు : జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా కల్పించాలని ఎంపిడిఒ రఘురాం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో విఒఎ సిబ్బందికి సూపర్ సేవింగ్స్ మహిళ భద్రత మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జిఎస్‌టి సవరణలతో నిత్యావసర సరుకులు, గృహ ఉపకరణాలు, ఔషధాలు, విద్య , స్టేషనరీ ఉత్పత్తులు, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, హెూటల్, వ్యవసాయ ఉపకరణాల ధరలు గణనీయంగా తగ్గుతాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఎం యామిని పూర్ణిమ,హెడ్ కానిస్టేబుల్ కెఎంఎస్ రాజు, సిసిలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

రగిలే నిప్పు కణిక భగత్ సింగ్ : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ఉరి కొయ్యను ముద్దాడిన ధీరుడు భగత్ సింగ్ అని ఆయన స్ఫూర్తితో యువత ఉద్యోగ, ఉపాధి కోసం పోరాడాలని, కడపలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఈనెల 28 భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శనివారం కడపలో బాలాజీ నగర్‌లోని యూత్ హాస్టల్‌లో భగత్ సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ యోధుడు షహీద్ భగత్ సింగ్ అని, నేటి యువత స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు చిన్న తనం నుంచే స్వతంత్ర్య పటిమ ఆకాంక్ష ఎక్కువ అని, స్వతంత్ర్య పోరాటంలో పాల్గొనేవారన్నారు. జలియన్ వాలా బాగ్ ఉదంతం ఆయన జీవిత చరిత్రనే మార్చేసిందన్నారు. అనునిత్యం స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం పరితపించేవారని, మతసామరస్యాన్ని ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో విభజన హామీల సాధన కోసం ఉద్యోగ,ఉపాధి కోసం యువత పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖలలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టడం లేదన్నారు.కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను విస్మరించిందని, ఎపికి టోపి పెట్టిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీసి హక్కుకు సాధించడంలో విఫలం చెందిందన్నారు.కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అన్నారు. ఉక్కు పరిశ్రమ శిలాఫలకాలుగా కార్యక్రమం అవుతుంది తప్ప పునర్నిర్మాణానికి ఎక్కడ చర్యలు చేపట్టడం లేదని ప్రభుత్వాలు మారుతున్న ఉక్కు పరిశ్రమ ముందుకు సాగలేదని అన్నారు. కడప నగరంలో యువతకు స్ఫూర్తి ప్రధాత అయినటువంటి యువకిశోరం షాహిద్ భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు పెద్దన్న, ప్రేమానందం, సురేష్, శ్రీను, అరవింద్, రంజిత్, దిలీప్, పవన్ పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం వ్యవహార శైలి మార్చుకోవాలి : డిసిసి

ప్రజాశక్తి-కాశినాయన

ఇంటింటి ప్రచారం చేస్తున్న విజయజ్యోతి

భారతీయ జనతా పార్టీతో కుమ్మక్కై ఓట్లు దొంగతనానికి పాల్పడిన కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహార శైలి మార్చుకోవాలని డిసిసి అధ్య క్షులు ఎన్. డి. విజయ జ్యోతి అన్నారు. లక్ష సంతకాల సేకరణలో భాగంగా శనివారం పోరుమామిళ్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి సభ్యులు, పోరుమామిళ్ల మండల అధ్యక్షులు అన్వర్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలో అవకతవకలు సృష్టించి భారతీయ జనతా పార్టీతో కుమ్మక్కై అనేక రకాలుగా ఓట్ల చోరీకి పాల్పడుతుందని వారు పేర్కొన్నారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం దగ్గర ఎలాంటి సమాధానం లేదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఇకనైనా తన వైఖరి మార్చుకొని అనేక రకాలుగా ఓట్ల చోరీని నిరోధించాలని చెప్పారు. సంతకాల సేకరణ ద్వారా భారత ప్రజల మనోగతాన్ని కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరు బాష, బి.కోడూరు మండల పార్టీ అధ్యక్షులు గుర్రప్ప, కాశినాయన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుల్లూరు పెద్ద ఖాజావల్లి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి బాలసుబ్బయ్య, బుడిగి శ్రీనివాసులు, కార్యకర్తలు నాగరాజు, సోహెల్, ముజ్జు , సమీర్ ,రిజ్వాన్ , నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

'ఐ లవ్ యు మహమ్మద్'తో బిజెపిలో వణుకు

ప్రజాశక్తి - కడప : దేశ, విదేశాల్లో 'ఐ లవ్ యు మహమ్మద్' అనే నినాదంపై మత విద్వేష సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, కేంద్ర రాష్ట్రాల్లోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాలు వణికిపోతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ స్పష్టం చేశారు. మహా ప్రవక్త పై అపరిమిత ప్రేమను ప్రదర్శిస్తున్న ముస్లిములు వారి మనోభావాల రక్షణకు చేస్తున్న ఆందోళనలపై భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లోని బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు బమ్మెలెత్తుతున్నాయని తెలిపారు. కడపలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ఒక కుటుంబం ఐ లవ్ యు మహమ్మద్ అని ప్రదర్శించిన బ్యానర్ పట్ల పోలీసులు కేసు నమోదు చేయడంతో ఈ ఆందోళనకు శ్రీకారం జరిగినట్లు వివరించారు. కేవలం ముస్లింలను పోరాటం వైపునకు వెళ్ళనివ్వకుండా నిరోధించేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ముసుగు ధరించిన బిజెపి ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయన్నారు.

భరోసా ఇచ్చేందుకే డిజిటల్ బుక్

ప్రజాశక్తి - కడప : ఇబ్బందిపడిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు డిజిటల్ బుక్ రూపొందించినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో డిజిటల్ బుక్ పోస్టర్లను మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, సురేష్ బాబు, పరిశీలకులు అజయ్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి 16 నెలల కాలంలో ప్రజలకు ఏ మేలు చేయలేదన్నారు. శాంతి భద్రతల విషయంలో బీహార్‌ను మించిపోయిందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలపై దొంగ కేసులు పెడుతున్నారన్నారు. పాత కేసులు తెరపైకి తీసుకువచ్చి జైల్లో పెడుతున్నారని చెప్పారు. దొంగ కేసులతో కూటమి నాయకులు రాక్షసానందం పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇబ్బంది పడిన కార్యకర్తలు, నేతలకు భరోసా ఇచ్చేందుకు డిజిటల్ బుక్ తయారు చేసినట్లు తెలిపారు. ఏ రోజు సంఘటన ఆరోజే యాప్‌లో రిజిస్టర్ చేయాలని చెప్పారు. ప్రతి సామాన్య ప్రజలు డిజిటల్ బుక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి తప్పక న్యాయం చేస్తామన్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన తీరు సరైంది కాదు, దీన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బాలకృష్ణను కాపాడిన విషయం మరిచిపోయి జగన్మోహన్ రెడ్డిని ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు.

ప్రచారంతోనే పర్యాటకం ముందడుగు

ప్రజాశక్తి- కడప అర్బన్ : ప్రచారంతోనే పర్యాటకానికి ముందడుగు పడుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ఫోటోల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ మన చుట్టు పక్కల గల పర్యాటక ప్రాంతాలను దర్శించేందుకు మనం తొలి ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. తర్వాత జిల్లాలోని ఇతర ప్రాంతాలను సందర్శించి, జ్ఞానాన్ని, సంప్రదాయాలను, సంస్కృతిని, వారసత్వాన్ని, సమాజంలో శాంతిని పెంపొందించే విధంగా ఉండాలన్నారు. పర్యాటక అంశంలో మన జిల్లా గండికోటతో ప్రపంచస్థాయిలో సగర్వంగా నిలబడగల్గిందన్నారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ పర్యాటకపరంగా గండికోటలో అవసరమైన వసతులు చేకూరుతున్నాయని ఈ కోటకు యునెస్కో గుర్తింపు పట్ల ఆశలు పెరుగుతున్నాయన్నారు.

దౌర్జన్యకాండ

ప్రజాదృష్టి

జిల్లాలో కూటమి నేతల దౌర్జన్యం పతాక స్థాయికి చేరుకుంది. గ్రావెల్, ఇసుక, మట్టి, రాజకీయ అక్రమార్కుల దాడులు, దౌర్జన్యాలతో చెలరేగిపోతోంది. జిల్లాలో ప్రకృతి సహజ సంపదను దోచుకోవడంలో కూటమి నాయకులు వైసిపి స్వాహాపర్వాన్ని ఏడాదిన్నర వ్యవధిలోనే అధిగమించిందనే విశ్లేషణలు ఉన్నాయి. ఇందుకు మచ్చుతునకగా కడప కార్పొరేషన్ పరిధిలోని నానాపల్లి గ్రావెల్ క్వారీలో అధికార పార్టీకి చెందిన కడప, కమలాపురం నియోజకవర్గ నాయకుల అనుచరులు పరస్పరం భౌతిక దాడులు చేసుకోవడం దిగ్భ్రాంత పరిచింది. కడప, కమలాపురం నియోజకవర్గానికి చెందిన నాయకుల గ్రావెల్ వాహనాలను సమానంగా సీజ్ చేయడం పోలీసుల బ్యాలెన్సింగ్ వైఖరిని గమనిస్తే విస్తుపోవాల్సివస్తోంది. ఏడాదిన్నర కిందటి నుంచి యథేచ్ఛగా సాగుతున్న దోపిడీపై విచారించి, దోపిడీ సంపదను వసూలు చేస్తే అక్రమార్కులను నిలవరించినట్లు అవుతుంది. రెవెన్యూ పోలీస్, మైనింగ్ అధికారులు అధికార పార్టీకి చెందిన నాయకుల దగ్గర స్వామిభక్తిని ప్రదర్శించడం ఏమనుకోవాలో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. విద్యాశాఖా మంత్రి లోకేష్ ఎదుట కమలాపురం, కడప నేతలు పరస్పరం దూషించుకున్నట్లు సమాచారం. దొరికినకాడికి దోచుకోవడం చాలక, పరస్పరం వ్యక్తిగతంగా దూషణలకు దిగినట్లు వార్తలు రావడం చర్చనీయాంశంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక నిల్వల దోపిడీ దగ్గర నుంచి ఇసుక, మట్టి, గ్రావెల్ తదితర క్వారీలను స్వాహా చేసి సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. కడప గడపలో గ్రావెల్ దోపిడీ వైరల్ కావడం తెలిసిందే. కడప మేయర్ కె.సురేష్‌బాబును తొలగిస్తూ మున్సిపల్‌శాఖ ఆదేశాలు జారీ చేయడం వెనుక గ్రావెల్ దోపిడీ వ్యవహారంపై ప్రజల దృష్టిని మరల్చడమేననే వాదన వినిపిస్తోంది. గండికోట పర్యాటక ప్రాజెక్టు కాంట్రాక్టర్ కార్యాలయంపై బిజెపి ఎమ్మెల్యే అనుచరులు గ్రామాభివృద్ధి పేరిట దాడులకు పాల్పడడం డబులింజన్ సర్కారు రాష్ట్ర ప్రజానీకానికి డబుల్‌స్ట్రోక్ ఇవ్వడ మేననే వాదన వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు చెప్పేదొకటి, ఆచరణలో చేసేదొకటిగా ఉంటోందనే చర్చ నడుస్తోంది. పరస్పర భౌతిక దాడుల కారణంగా ఇప్పటికే రెండు క్లీన్‌ఎనర్జీ సంస్థలు వెనక్కి వెళ్లడం ద్వారా రెండు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. ఫ్యూడల్, ఫ్యాక్షన్ సంస్కృతి కారణంగా జిల్లా పారిశ్రామిక, పర్యాటక, సేవల రంగాల అభివృద్ధి కుదేలవుతున్న కారణంగా గ్రామీణ నిరుద్యోగం, పట్టణ నిరుద్యోగంతో పోటీపడి పెరుగు తుండడం విభ్రాంతిని కలిగిస్తోంది. ఫలితంగా ప్రజానీకం కొనుగోలు శక్తి క్షీణించడం ద్వారా జీవన ప్రమాణాలు పాతాళానికి పడిపోవడం జీవన సంక్షోభానికి దారి తీస్తుందనడంలో సందేహం లేదు. కూటమి సర్కారు మేల్కొని ప్రకృతి సంపదను దోపిడీ చేయడాన్ని నిషేధించి, ప్రజల సంక్షేమంపై దృష్టి సారించడం ద్వారా ప్రజాభిమానాన్ని చూరగొంటారని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

గమ్యస్థానాలకు వెళ్లేందుకు బస్సు వద్ద ఉన్న రద్దీ

దసరా సెలవులతో బస్సులు కిటకిట

ప్రజాశక్తి - వేంపల్లె

దసరా పండుగ సెలవులు సందర్భంగా ఆర్‌టిసి బస్సులు కిటకిటలాడుతున్నాయి. తమతమ సొంత ఊర్లకు వెళ్లడానికి ప్రజలు, విద్యార్థులు సిద్ధం కావడంతో ఆర్‌టిసి బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ట్రిపుల్‌ఐటికి దసరా సెలవులు ఇవ్వడంతో శనివారం విద్యార్థులు ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచి చూశారు. ప్రతి బస్సు రద్దీగా వెళ్లుతుండడంతో బస్సుల కోసం ప్రజలు, విద్యార్థులు ఎదురుచూశారు. రద్దీతో పులివెందుల రోడ్డులో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. గతంలో ఇడుపులపాయ నుంచి ఆర్‌టిసి బస్సులను నేరుగా ఆయా ప్రాంతాలకు నడిపేవారు. ఇది ఆ విద్యార్థులకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం దసరా సెలవులకు ప్రత్యేక బస్సులు వేయకపోవడంతో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. మహిళలకు ఉచితం కావడంతో రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల రద్దీని గమనించి పులివెందుల డిపో బస్సులను సర్వీస్‌లోకి పంపించి ఆయా ప్రాంతాలకు తిప్పుతున్నట్లు పులివెందుల డిఎం రామకృష్ణ తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

రైతు సమస్యలపై ప్రస్తావన

ప్రజాశక్తి - చాపాడు

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పుట్టా'

కెసి కెనాల్ రైతులు ఇరుకారు (రెండు పంటలు) ఆకాంక్షను నెరవేర్చాలని శనివారం శాసన సభలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రస్తావించారు. కెసి కాలువ కింద 92వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. కెసి కాలువకు అనుసంధానంగా అలగనూరు బాలన్సింగ్ రిజర్వాయర్ ఉందన్నారు. ఇందులో 2.965 టీఎంసీ నిలువ ఉంచుకునే అవకాశం ఉందన్నారు. అలగనూరు కట్ట తెగిపోయిందని, మరమ్మతులకు రూ.36కోట్లు అవసరమన్నారు. దీన్ని పూర్తి చేస్తే కెసి కాలువ ద్వారా రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. తద్వారా రైతులకు రూ.250 కోట్ల ఆదాయం సమాకూరుతుందని ఆయన వివరించారు. ఆ మేరకు నిధులు మంజూరు చేయాలని పుట్టా ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించారు.

రేపు 'అల్లాడుపల్లె' చైర్మన్‌గా నారాయణ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - చాపాడు

మండలపరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని టిటిడి కల్యాణ మండపంలో ఏర్పాటు చేశా మన్నారు. ఆలయ చైర్మన్‌గా పెరుగు వీర నారాయణ యాదవ్, కమిటీ సభ్యులుగా ఆర్.వీరారెడ్డి, జిసిజి వీరారెడ్డి, పి.పార్వతి, కే.ఆదిలక్ష్మి, డి.పావని, పి.చెన్నమ్మ, వి.గుర్రమ్మ, వి.ఓం మహేశ్వర్‌రెడ్డి, బి.జగన్నాథరెడ్డి బాధ్యతలు చేపడతారని వివ రించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతారని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా పివి రమణ..

వేంపల్లె : స్థానిక వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా చింతలమడుగుపల్లెకు చెందిన పాలేగాళ్ళ వెంకటరమణ ప్రమాణ స్వీకార చేయనున్నారు. వషబాచలేశ్వర స్వామి దేవస్థానంకు ఇటీవల పాలక మండలి సభ్యులను దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు నియమించారు. ఈమేరకు 29వ తేది సోమవారం ఉదయం 9 గంటలకు వషబాచలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన మైయిన్ బజార్‌లో ఉన్న శ్రీవీరాంజనీయ స్వామి ఆలయంలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం చేపట్టనున్నారు. దేవస్థానం అధికారుల సమక్షంలో పాలక మండలి సభ్యులతో పాటు చైర్మన్ గా పివి రమణ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దేవస్థానం పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారంకు పులివెందుల టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డితో పాటు టిడిపి నేతలు హజరు కానున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం టిఫిన్ సౌకర్యం కూడ కల్పించినట్లు కాబోయే దేవస్థానం చైర్మన్ పివి రమణ చెప్పారు. పాలక మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమంకు టిడిపి నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - వేముల

పెండ్లూరు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో శనివారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేపట్టారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి, నాయకుడు పేర్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేర్ల పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల ద్వారా ఎలాంటి అవకతవకలు జరగవని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కల్లూరు చంద్ర వర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, మేకల విజయభాస్కర్‌రెడ్డి, ఉత్తమరెడ్డి, సత్యమారెడ్డి, బాల పుల్లారెడ్డి, చిన్నరెడ్డి, సాంబ శివారెడ్డి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప అర్బన్ : నగరంలోని 2వ డివిజన్ దేవుని కడపలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి శనివారం స్మార్ట్ రేషన్ కార్డ్ లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలు ప్రజలకు మరింత సులభంగా అందేటట్లు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చిరిగి పోని విధంగా స్మార్ట్ రేషన్ కార్డులు ప్రభుత్వం రూపొందించి లబ్ధిదారులకు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వేర్ హౌస్ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మురుగు కష్టాలు తీరేదెన్నడో..!

వృర్థాలతో నిండిపోయిన వాటర్ వాల్ గుంత - కంపు, దోమలతో అల్లాడుతున్న ప్రజలు

చింతలమడుగుపల్లె క్రాస్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ప్రజాశక్తి - వేంపల్లె

మురుగు కష్టాలు తప్పేదెన్నడని వేంపల్లె వాసులు అల్లాడి పోతున్నారు. కంపు, దోమలతో వేగలేకున్నామని ఆందోళన చెందుతున్నారు. వేంపల్లె పంచాయతీలోని ఆయా ప్రాంతాల్లో రోడ్లపై మురుగు పారుతోంది. గండి రోడ్డులో ఉన్న చింతలమడుగుపల్లె క్రాస్‌లో ఉన్న వాటర్ వాల్ గుంత వ్యర్థాలతో పూర్తిగా పూడిపోయింది. తాగునీరు కలుషితం అవుతుందని పుల్లయ్యతోట వీధి, మదీనాపురం, చింతల మడుగుపల్లె ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండడంతో పాదచారులు అందులోనే నడవాల్సి వస్తోంది. వాహనదారులు, ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. పారిశుధ్యానికి సంబంధించిన పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అటు గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు, ఇటు అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులుగానీ పారిశుధ్యంపై పట్టించుకోకపోవడంతో వేంపల్లెలో అపరిశుభ్రత తాండవిస్తోంది. డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయకపోవడం, చెత్తచెదారం కాలువలో పడి మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. నివాసాల వద్ద ఆ నీరు నిలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే మురుగునీరు తొక్కాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వాతావరణ మార్పుల వల్ల ప్రజలు పలు రోగాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో దోమలు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండి రోడ్డులో ఉన్న చింతల మడుగుపల్లె క్రాస్ వద్ద డ్రెయినేజి కాలువల్లో ఉన్న మురుగు రోడ్లపైనే పారుతోంది. చింతలమడుగుపల్లె క్రాస్ వద్ద తాగునీటి పైపులైన్ వాటర్ వాల్ ఉంది. ఆ వాటర్ వాల్ గుంత వ్యర్థాలతో నిండిపోయింది. నిండిపోయిన వాటర్ వాల్ గుంతను శుభ్రం చేయాలని కోరినా పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతలమడుగుపల్లె, మదీనాపురం, పుల్లయ్య తోట వీధుల్లో ఉన్న ప్రజలకు నీటి సరఫరా అవుతోంది. చింతలమడుగుపల్లె క్రాస్‌లో కల్వర్టు ఉండడంతో మురుగు నీరు నిల్వ ఉండడంతో రోడ్డు దిగే సమయంలో మురుగు పాదచారులపై పడుతోంది. మురుగు కాలువలు శుభ్రం చేయడంతోపాటు రోడ్డుపై నిల్వ ఉన్న కంపు నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాటర్ వాల్ గుంత శుభ్రం చేయాలి..

గండి రోడ్డులో ఉన్న చింతలమడుగు పల్లె క్రాస్ వద్ద తాగునీటికి సంబంధించిన వాటర్ వాల్ గుంత నెలల తరబడి చెత్తతో నిండిపోయింది. చెత్తను తొలగించాలని పలుమార్లు పంచాయతీ సిబ్బందికి సమాచారమిచ్చినా ప్రయోజనం లేదు. కలుషిత నీరు తాగితే పలువ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు వాటర్ వాల్ గుంత శుభ్రం చేసేందుకు కృషి చేయాలి

- మల్లికార్జున, వేంపల్లె

దోమల బెడద ఎక్కువైంది..

పారిశుధ్యం పనులు సక్రమంగా ప్రతిరోజూ జరగక దోమల బెడద ఎక్కువైంది. డ్రెయినేజి కాలువల్లో పూడిక తీయక మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. వీధుల్లో పూడ్చేసిన డ్రెయినేజి కాలువలకు మరమ్మతులు చేయాలి. డ్రెయినేజీ కాలువల్లో తీసిన చెత్తను వెంటనే ఎత్తేయాలి. ఈద్గా సమీపంలో నిల్వ ఉన్న వర్షపు నీరు, మురుగును తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ కరీముల్లా, వేంపల్లె

పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాం..

వేంపల్లెలో పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాం. ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదు. చెత్తను పంచాయతీ ట్రాక్టర్లలో వేయాలని దుకాణాదారులకు నోటీసులిచ్చాం. గ్రామమంతా శుభ్రంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాం.

- నాగభూషణంరెడ్డి, ఇఒ, వేంపల్లె

వ్యర్థాలతో పూడిపోయిన వాటర్ వాల్ గుంత

ప్రజలపై భారం తగ్గించేందుకే జిఎస్‌టిలో సంస్కరణలు

హాజరైన ఎస్‌హెచ్‌జి సభ్యులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కమిషనర్ రాముడు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

18శాతం ఉన్న జిఎస్‌టిని 5శాతానికి తగ్గించడాన్ని ప్రజలకు వివరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ సభ భవనంలో మెప్మా సిబ్బందికి సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించాలన్నారు. పట్టణ సిఐ సీతారాం రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, సారా వంటి మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎసిటివో స్వరాజ్యం, మెప్మా సిఎంఎం నాగలక్ష్మి, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ దివిజ సంపతి

ఖాజీపేట : ప్రజలపై పన్నుల భారం తగ్గించి, కొనుగోలు శక్తి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి సంస్కరణలు చేప ట్టిందని ఎంపిడిఒ దివిజ సంపతి పేర్కొన్నారు. శనివారం వెలుగు ఎపిఎం శైలజ అధ్యక్షతన మహిళలకు సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, మత్తు పదార్థాల గురించి వివరించారు. డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ మైథిలి, సిఐ వంశీధర్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ కొనుగోలు చేపట్టడం ద్వారా పన్నుల భారం నుంచి ప్రయోజనం పొందుతారన్నారు.

మైదుకూరు రూరల్ : మైదుకూరు స్త్రీశక్తి భవనం, ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక బృందాల రిసోర్స్ పర్సన్‌లకు మహిళల భద్రత, మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మైదుకూరు అర్బన్ సిఐ కె.రమణారెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, డ్రగ్స్ నిర్మూలన ఆవశ్యకత గురించి వివరించారు. స్వయం సహాయక బందాల సభ్యులు, రిసోర్స్ పర్సన్లు గ్రామాల్లో చురుకుగా పనిచేస్తుంటారని, డ్రగ్స్, గంజాయి వంటి వాటిపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1972 నిరంతరం అందుబాటులో ఉంటుందని సిఐ తెలిపారు. మహిళలు తమ రక్షణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ 181, పిల్లల భద్రత కోసం 1098 నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సేవలు 24 గంటలూ పనిచేస్తాయని రిసోర్స్ పర్సన్లకు వివరించారు. మహిళలు, పిల్లల రక్షణ కోసం గ్రామస్థాయిలో రిసోర్స్‌పర్సన్లు క్రియాశీలకంగా వ్యవహరించి, పోలీసు శాఖకు సహకరించాలని సిఐ కోరారు.

మాట్లాడుతున్న అర్బన్ సిఐ రమణారెడ్డి

లక్ష్యాలను పూర్తి చేసే దిశగా పనిచేయాలి

మాట్లాడుతున్న ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

లక్ష్యాలను పూర్తి చేసే దిశగా పనిచేయాలని అధికారులు సూచించారు. ఉద్యానశాఖ, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిసాగు పథకం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎంపిడిఒ కార్యాలయ భవనంలో పులివెందుల, లింగాల, వేముల రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యానశాఖ ప్రగతి, ఈ పంట నమోదు అంశాలపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా ఉద్యాన అధికారి సతీష్, ఎపి ఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రిప్పునకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయా లన్నారు. ఉద్యాన శాఖలో కొత్తగా ఉద్యాన పంటలు నాటుకునే రైతులకు దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, నేరేడుకు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతు సేవ కేంద్రం వారీగా ఈ పంట నమోదు పురోగతిని ఆ కేంద్రం సహాయకులను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులుకు చేపట్టవలసిన నివారణ చర్యలను రైతు సేవా కేంద్రం సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఎపి ఎంఐపీ ఎమ్ఐ ఇంజినీర్ శ్రీనివాసులు, పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఎమ్ కాంపౌండ్‌లో వెలగని విద్యుద్దీపాలు

ప్రజాశక్తి - ముద్దనూరు



పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం చేపట్టాయి. అధికారులు ఆ దిశగా పరిసరాల శుభ్రతపై సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ చెత్త సేకరణ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. నిత్యం పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన భాధ్యత పంచాయతీ అధికారులది. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలో ఇందుకు భిన్నంగా ఉంటోంది. ఎల్ఎమ్ కాంపౌండ్‌లో వారం రోజులుగా విద్యుద్దీపాలు వెలగక కాలనీ వాసులు రాత్రివేళ చీకట్లోనే గడుపుతున్నారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల ప్రహరీ పక్కన పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగాయి. విష పురుగులు, పందులు సంచ రిస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. దుర్వాసన వెదజల్లుతూ దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లేందుకు విద్యార్థులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. విద్యుద్దీపాలు లేకపోవడంతో పాఠశాల ప్రహరీ ప్రాంతంలో రాత్రివేళ బహిర్భూమికి వెళుతున్నారనే ఆరోపణలున్నాయి. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా వారు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో గ్రామ పంచాయతీ, తహశీల్దార్, గ్రంథాలయం వెనకాల ప్రహరీ ఆనుకుని కంపచెట్లు, పిచ్చి మొక్కలు దారి పొడవునా ఏపుగా పెరిగి పోయాయి. సంబంధిత అధికారులు స్పందించి శుభ్రం చేయించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్ దారిలో ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలు

రక్తదాతలకు పండ్లు అందిస్తున్న డాక్టర్ వరుణ్ చక్రవర్తి

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్వాతంత్ర సమరయోధుడు షాహిద్ భగత్ సింగ్ 118 జయంతి సందర్భంగా భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ ఆధ్వర్యంలో పొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ రూపానంద్, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చుని వారు సూచించారు. రక్తదానం మరో ప్రాణాన్ని నిలబెడుతుందన్నారు. 40మంది రక్తదానం చేశారు. శిబిరంలో భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుర్రం డేవిడ్‌రాజ్, రామకృష్ణ, ప్రమోద్, వీరన్న, రక్తనిధి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ-ఆర్‌డి క్యాంప్‌నకు ఎంపికైన నవీన్

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ బి.నవీన్ యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల తరఫున ప్రీ-ఆర్‌డి క్యాంప్‌నకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. నవీన్ బిఎస్‌సి మూడవ సంవత్సరం వృక్షశాస్త్రం చదువుతున్నాడు. నవీన్ నవంబర్ 1వ తేదీ నుండి 10 వరకు గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విశ్వవిద్యాలయంలో జరిగే ప్రత్యేక శిక్షణా శిబిరానికి హాజరుకానున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతిభావంతులైన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పించడం విశేషమన్నారు. తమ కళాశాల విద్యార్థి ఈ విశిష్ట గౌరవం పొందడం గర్వకారణమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థుల కృషి, పట్టుదల, అధ్యాపకుల ప్రోత్సాహ ఫలితమేనని అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సహచరులు నవీన్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

వెస్ట్ జోన్ ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్‌నకు వాలంటీర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీ నేషనల్ సర్వీస్ స్కీమ్ వాలంటీర్లు విశ్వవిద్యాలయ స్థాయిలో, రాబోయే వెస్ట్ జోన్ ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్ నకు ఎంపికయ్యారు. బి. ఈశ్వర్ (వైవీయూ) బి. నవీన్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదుకూరు),పి.నీలమహేశ్వరి (జిడిసి కడప) 2025 అక్టోబర్-నవంబర్ నెలల్లో గుజరాత్లో నిర్వహించే శిబిరానికి హాజరుకానున్నారు. వెస్ట్ జోన్ ప్రీ-ఆర్డీ క్యాంప్ లో ప్రతిభకనబరచిన వాలంటీరు న్యూ ఢిల్లీలో2026, జనవరి 1 నుంచి 30 వరకు నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో విశ్వవిద్యాలయం , రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే గౌరవాన్ని పొందుతారు. తెలిపారు.

కార్మికుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో పారిశుధ్య కార్మికులు నివసిస్తున్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని ఎపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూ నియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. శనివారం చలో కడప కార్పొరేషన్ కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల నివాస ప్రాంతంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని పేర్కొ న్నారు. సమస్యలను పరిష్క రించాల్సిన అధికా రులు నిమ్మకు నీరేతినట్లు వ్యవహ రించడం బాధా కరమని తెలిపారు. నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో కడప నగరపాలక సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. తిలక్ నగర్, అరుంధతి నగర్, పాత కడప, మాసాపేట కోటర్స్, శంకరాపురం కోటర్స్, అలాగా మన మున్సిపల్ కార్మికులు నివాసం ఉన్న ప్రాంతంలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని చెప్పారు. సుంకర రవి మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు, పనిముట్లు, సబ్బులు, నూనెను, రైన్ కోట్లు, యూనిఫామ్, చెప్పులు, ఇంతవరకు అందలేదన్నారు. చేశారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి నాయకుల వద్దకు వచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

సర్వీస్ రిజిస్టర్ పోయినది

కడప హెచ్. భాస్కరరావు తండ్రి సుబ్బారావు అను నేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల J. కొత్తపల్లి చింతకొమ్మదిన్నె మండలం నందు పనిచేయుచు 31.5.2025 తేదీన హెడ్మాస్టర్ ప్రమోషన్ కొరకు గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్, కడప నందు పాల్గొని 1.6.2025 నా ప్రధాన ఉపాధ్యాయులు గా అన్నమయ్య జిల్లా నందలూరు మండలం టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బాధ్యతలు తీసుకున్నాను. నా సర్వీస్ రిజిస్టర్ అప్పటి నుండి కనబడుటలేదు. ఎవరికైనను నా సర్వీస్ రిజిస్టర్ (S.R) దొరికిన నా సెల్ నెంబర్ **7013122450, 9491938024**నకు తెలి యజేయవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నాను.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప

I.A.No. 385/2022

O.S. No. 517/2012

1) బుడ్డాయపల్లి సజ్జల సామ్యూల్, తండ్రి బుడ్డాయపల్లి సజ్జల స్వామిదాసు, వయస్సు 72 సం.లు., నివాసము 3/691, రాజారెడ్డి వీధి, కడప నగరం.
2) బుడ్డాయపల్లి సజ్జల సురేష్ దాసన్, తండ్రి బుడ్డాయపల్లి సజ్జల స్వామిదాసు, వయస్సు 62 సం.లు.,నివాసము 26/91, వసంతపేట,ప్రొద్దుటూరు పట్టణం,వై.యస్.ఆర్. జిల్లా.
3)బుడ్డాయపల్లి సజ్జల సంతోష్ దాసన్, తండ్రి బుడ్డాయపల్లి సజ్జల స్వామిదాసు, వయస్సు 58 సం.లు., నివాసము 3/1967, రాజారెడ్డి వీధి, కడప నగరం.
4) బుడ్డాయపల్లి సజ్జల సారమ్మ, భర్త బుడ్డాయపల్లి సజ్జల సామ్యూల్, వయస్సు 62 సం.లు., గృహిణి, నివాసము 3/691, రాజారెడ్డి వీధి, కడప నగరం.

...పిటీషనర్స్/వాదులు

Vs

1) సజ్జల సుందర రాజు, తండ్రి సజ్జల డేవిడ్, వయస్సు అందాసుగా 77 సం.లు., నివాసము 8/55-2ఎ, ప్రకాష్ నగర్, కడప నగరం.
2) సజ్జల బాబు, తండ్రి సజ్జల సుందర్ రాజు, వయస్సు 55 సం.లు., నివాసము డోర్ నెం. 4/177, శివానందపురం, కడప నగరం.
3) సి. శివశంకర్ రెడ్డి, తండ్రి సి. సూరా రెడ్డి, వయస్సు 58 సం.లు., నివాసము డోర్ నెం. 10/430, బద్వేల్ టౌన్, మండలం, వై.యస్.ఆర్.జిల్లా
4) చింతకుంట సుబ్బారెడ్డి, తండ్రి సుబ్బారెడ్డి, వయస్సు 50 సం.లు., నివాసము శివాలపల్లి, చెన్నూరు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.
5) ముమ్మడి శ్రీనివాసులు రెడ్డి, తండ్రి ముమ్మడి సుబ్బారెడ్డి, వయస్సు 50 సం.లు., నివాసము శివాలపల్లి, చెన్నూరు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.
(ప్రతివాదులు 4 మరియు 5 ఐ.నెం. 1479/2009, తేది: 01.12.2009న ద్వారా దావాలో చేర్చబడినారు).

...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

3వ రెస్పాండెంట్/ప్రతివాది పరము కోర్టు నోటీసు

పై దావాలో పిటీషనర్స్ కోర్టు వారిచే డిస్మిస్ అయిన పై దావా నెం. 517/2012 పునరుద్ధరణ కోసం దాఖలు చేసిన ఐ.ఎ.నెం.385/2022లో 3వ ప్రతివాది అయిన సి. శివశంకర్ రెడ్డి అను నీకు ఇంతవరకు కోర్టు నుండి నోటీసులు ముట్టనందున రాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారు నీ యొక్క హాజరు గురించి ప్రజాశక్తి దినపత్రికలో ఇదివరలో ఉత్తర్వులు జారీ చేసియున్నారు.కావున నీవు 10.10.2025వ తేదిన ఉదయం 10.30 గంటలకల్లా మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కడప వారి ఎదుట హాజరై పై ఐ.ఎ.385/2022, ఓ.యస్.నెం. 517/2012 గురించి మీకు ఏవైనా అభ్యంతరములు వుంటే స్వయంగా గాని, వకీలు ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనంతట మహారాజశ్రీ కోర్టు వారు నీపై పరోక్షంగా తీర్మానం చేయుదురు.

//కోర్టు ఉత్తర్వు ప్రకారం ప్రచురించడమైనది//

T.S.RANGANAYAKULU,
B.A., L.L.B.,
పిటీషనర్స్/వాదులపరం న్యాయవాది
సెల్ : 8179860120

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప

I.A.No. 386/2022

O.S. No. 517/2012

1) బుడ్డాయపల్లి సజ్జల సామ్యూల్, తండ్రి బుడ్డాయపల్లి సజ్జల స్వామిదాసు, వయస్సు 72 సం.లు., నివాసము 3/691, రాజారెడ్డి వీధి, కడప నగరం.
2) బుడ్డాయపల్లి సజ్జల సురేష్ దాసన్, తండ్రి బుడ్డాయపల్లి సజ్జల స్వామిదాసు, వయస్సు 62 సం.లు.,నివాసము 26/91, వసంతపేట,ప్రొద్దుటూరు పట్టణం,వై.యస్.ఆర్. జిల్లా.
3)బుడ్డాయపల్లి సజ్జల సంతోష్ దాసన్, తండ్రి బుడ్డాయపల్లి సజ్జల స్వామిదాసు, వయస్సు 58 సం.లు., నివాసము 3/1967, రాజారెడ్డి వీధి, కడప నగరం.
4) బుడ్డాయపల్లి సజ్జల సారమ్మ, భర్త బుడ్డాయపల్లి సజ్జల సామ్యూల్, వయస్సు 62 సం.లు., గృహిణి, నివాసము 3/691, రాజారెడ్డి వీధి, కడప నగరం.

...పిటీషనర్స్/వాదులు

Vs

1) సజ్జల సుందర రాజు, తండ్రి సజ్జల డేవిడ్, వయస్సు అందాసుగా 77 సం.లు., నివాసము 8/55-2ఎ, ప్రకాష్ నగర్, కడప నగరం.
2) సజ్జల బాబు, తండ్రి సజ్జల సుందర్ రాజు, వయస్సు 55 సం.లు., నివాసము డోర్ నెం. 4/177, శివానందపురం, కడప నగరం.
3) సి. శివశంకర్ రెడ్డి, తండ్రి సి. సూరా రెడ్డి, వయస్సు 58 సం.లు., నివాసము డోర్ నెం. 10/430, బద్వేల్ టౌన్, మండలం, వై.యస్.ఆర్.జిల్లా
4) చింతకుంట సుబ్బారెడ్డి, తండ్రి సుబ్బారెడ్డి, వయస్సు 50 సం.లు., నివాసము శివాలపల్లి, చెన్నూరు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.
5) ముమ్మడి శ్రీనివాసులు రెడ్డి, తండ్రి ముమ్మడి సుబ్బారెడ్డి, వయస్సు 50 సం.లు., నివాసము శివాలపల్లి, చెన్నూరు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.
(ప్రతివాదులు 4 మరియు 5 ఐ.నెం. 1479/2009, తేది: 01.12.2009న ద్వారా దావాలో చేర్చబడినారు).

...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

3వ రెస్పాండెంట్/ప్రతివాది పరము కోర్టు నోటీసు

పై దావాలో పిటీషనర్స్ కోర్టు వారిచే డిస్మిస్ అయిన పై దావా నెం. 517/2012 పునరుద్ధరణ కోసం దాఖలు చేసిన ఐ.ఎ.నెం.386/2022లో 3వ ప్రతివాది అయిన సి. శివశంకర్ రెడ్డి అను నీకు ఇంతవరకు కోర్టు నుండి నోటీసులు ముట్టనందున రాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారు నీ యొక్క హాజరు గురించి ప్రజాశక్తి దినపత్రికలో ఇదివరలో ఉత్తర్వులు జారీ చేసియున్నారు.కావున నీవు 10.10.2025వ తేదిన ఉదయం 10.30 గంటలకల్లా మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కడప వారి ఎదుట హాజరై పై ఐ.ఎ.386/2022, ఓ.యస్.నెం. 517/2012 గురించి మీకు ఏవైనా అభ్యంతరములు వుంటే స్వయంగా గాని, వకీలు ద్వారా గాని అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేనంతట మహారాజశ్రీ కోర్టు వారు నీపై పరోక్షంగా తీర్మానం చేయుదురు.

//కోర్టు ఉత్తర్వు ప్రకారం ప్రచురించడమైనది//

T.S.RANGANAYAKULU,
B.A., L.L.B.,
పిటీషనర్స్/వాదులపరం న్యాయవాది
సెల్ : 8179860120